సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు



ఆదిలాబాద్‌టౌన్: శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ గౌస్ ఆలం ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, ధర్నా చేపట్టరాదని పేర్కొన్నారు.



కేంద్రమంత్రులను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్: కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, కుమారస్వామిలను ఢిల్లీలో ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ గురువారం కలిశారు. ఎయిర్‌ఫోర్స్ కేంద్రం ఏర్పాటు, సీసీఐ పరిశ్రమ తెరిపించాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
31.3/25.5

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ కారణంగా ఉక్కపోతగా ఉంటుంది. అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

డయల్ యువర్ డీఎంకు స్పందన



ఫోన్‌లో మాట్లాడుతున్న డీఎం కల్పన

ఆదిలాబాద్: ఆర్టీసీ డిపో కార్యాలయంలో గురువారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 11 మంది ప్రయాణికులు డీఎం కల్పనతో ఫోన్‌లో మాట్లాడారు. పలువురు నూతన బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరగా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఆర్టీసీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో జిల్లాలోని యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ కోసం అక్టోబర్ 5 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేందర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడునెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయస్సు గల యువకులు ప్లంబింగ్, శానిటేషన్, ఎలక్ట్రీషియన్, హౌజ్‌వైరింగ్‌పై శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు సెల్ 8328507232, 8790414049 నంబర్లపై సంప్రదించాలని సూచించారు.

పెసా చట్టంలో ప్రత్యేక అధికారాలు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: పెసా చట్టం 1996 ప్రకారం పంచాయతీలకు ప్రత్యేక అధికారాలు కల్పించామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లోని గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వశాఖలు చేపట్టబోయే ప్రతీ కార్యక్రమానికి స్థానిక గ్రామసభ తీర్మానం తప్పనిసరి అన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో గిరిజనులకు అన్ని హక్కులు కల్పించబడ్డాయన్నారు. వాటిని కాలరాసేలా వ్యవహరించేవారిపై చర్యలు తప్పవన్నారు. ఆదివాసీలకు వారి ప్రయోజనాలను అందించేలా చూడాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ పాల్గొన్నారు.

గోండిలిపి పండితుడికి నివాళి



నివాళులర్పిస్తున్న ఖుష్బూ గుప్తా

నార్నూర్: గోండిలిపి పండితుడు కొట్నాక్ జంగు అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరమని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా పేర్కొన్నారు. మండలంలోని గుంజాల గ్రామంలో గురువారం కొట్నాక్ జంగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొట్నాక్ జంగు పురాతన కాలం నుంచి గోండిలిపి ప్రతులను భద్రపర్చి ప్రపంచానికి తెలియజేశారన్నారు. ఆదివాసీ సమాజం ఒక మంచి పండితుడి కోల్పోయిందన్నారు. పెసా కోఆర్డినేటర్, రాయిసెంటర్ సార్‌మేడి కొట్నాక్ కృష్ణ, పెద్దలు ఆత్రం భాస్కర్, అర్కా మాణిక రావు, వసంత్ రావు, వినాయక్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడ పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్–14 బాల, బాలికల రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో ప్రతిభ కనబర్చారు. వరంగల్ జిల్లాలో గురువారం జరిగిన జూడో పోటీల్లో 8 పతకాలతో మెరిశారు. ఈశ్వర్, అక్షిత, రేష్మలు(రజతం),లక్ష్మీనారాయణ, సిద్ధూ, శ్రీజిత్, దీపక్ కుమార్, తేజశ్రీ (కాంస్య) పతకాలు సాధించారని శిక్షకుడు రాజు తెలిపారు.



ఆదిలాబాద్ పట్టణ ముఖచిత్రం

కార్పొరేషన్‌గా ఆదిలాబాద్!

- త్వరలో బల్దియాలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ
- కొత్తగా వార్డుల ఏర్పాటుకు ప్రతిపాదనల స్వీకరణ
- మున్సిపాలిటీలో నాలుగు గ్రామాల విలీనానికి అవకాశం
- కసరత్తు చేస్తున్న అధికార యంత్రాంగం
- కార్పొరేషన్ ఏర్పాటుకు మార్గం సుగమం

ఆదిలాబాద్‌లోని వార్డులు:	49
పట్టణ జనాభా:	1,80,390
పట్టణంలోని కుటుంబాలు:	48,393
పట్టణ విస్తీర్ణం:	50.69 స్కేర్ కిలోమీటర్లు
విలీనమయ్యే అవకాశమున్న గ్రామాలు:	04

కైలాస్‌నగర్: గ్రేడ్–1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ బల్దియా కార్పొరేషన్‌గా అవతరించే దిశగా అడుగులు పడుతున్నాయి. పట్టణాలు ఆనుకుని ఉన్న గ్రామాలను కలుపుకొని ప్రజలకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలనే దిశగా ప్రభుత్వం దృష్టి సారించింది. త్వరలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (యూడీఏఎస్) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మున్సిపాలిటీకి ఆనుకుని ఉన్న గ్రామాలను విలీనం చేసేందుకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాల్సిందిగా కలెక్టర్‌ను ఆదేశించింది. ఆ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. వాటికి సంబంధించిన వివరాలతో ప్రతిపాదనలు పంపించేందుకు సిద్ధమవుతున్నారు. అదే జరిగితే వార్డుల సంఖ్య పెరిగి కార్పొరేషన్ ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది.

నాలుగు గ్రామాలు విలీనమయ్యే ఛాన్స్..

ఆదిలాబాద్ మున్సిపాలిటీ గత కొన్నేళ్లుగా శరవేగంగా విస్తరిస్తోంది. పట్టణానికి నలుదిక్కులా కొత్తగా లేఅవుట్లు వెలుస్తుండటంతో భవన నిర్మాణాలు జోరందుకున్నాయి. నివాస గృహాల సంఖ్య ఏటికేడు పెరగడంతోపాటు పట్టణ జనాభా విస్తరిస్తోంది. 2011 లెక్కల ప్రకారం పట్టణ జనాభా 1,55,968 మంది ఉండగా, ప్రస్తుతం ఈ సంఖ్య 2 లక్షలు దాటి ఉండవచ్చనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. మావల మండలంలోని మావల, బట్టిసావర్‌గాం, ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని పొచ్చెర, తాంసి మండలంలోని పొన్నారి గ్రామాలు సైతం అదే స్థాయిలో విస్తరిస్తున్నాయి. నివాస గృహాలతో పాటు జనాభా పెరుగుదలలోనూ మున్సిపాలిటీతో పోటీ పడుతున్నాయి. లేఅవుట్లు విస్తృతంగా ఏర్పడటంతో రియల్ వ్యాపారం లాభసాటిగా సాగుతోంది. పైగా ఈ గ్రామాలన్నీ మైదాన ప్రాంతంలోనే ఉండటంతో వాటిని బల్దియాలో కలిపేందుకు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తమయ్యే అవకాశం లేదు. దీంతో ఈ నాలుగు గ్రామాలు.. మున్సిపాలిటీలో విలీనమయ్యేందుకు అవకాశముంది.

కసరత్తు చేస్తున్న అధికార యంత్రాంగం

మున్సిపాలిటీని ఆనుకుని ఉండి అభివృద్ధి చెందుతున్న గ్రామాలను విలీనం చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని ప్రభుత్వం ఆదేశించింది. కలెక్టర్ నేతృత్వంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారితో కూడిన ప్రత్యేక కమిటీని నియమిస్తూ వారికి బాధ్యతలు అప్పగించింది. మున్సిపాలిటీని ఆనుకుని అభివృద్ధి చెందుతున్నటువంటి మైదాన ప్రాంతాల్లోని గ్రామాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధి ఏమేరకు ఉండాలి, 2024 వరకు దాని పరిధిలోని జనాభా ఎంత ఉందనే వివరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించింది. వీటికనుగుణంగా కసరత్తు చేస్తున్న శాఖల అధికారులు నాలుగు గ్రామాలను మున్సి ఎల్ పరిధిలో విలీనం చేసే దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇందుకు జిల్లా కలెక్టర్ ఆమోదముద్ర వేయాల్సి ఉంటుంది. నాలుగు గ్రామాల పరిధిలో సుమారు 11 వేల మంది జనాభా ఉండే అవకాశముంది. దీంతో పట్టణంలో మరో రెండు వార్డులు కొత్తగా ఏర్పాటయ్యే ఛాన్స్ ఉంది. ఇదే జరిగితే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు అనివార్యం కావడంతోపాటు 50కి పైగా వార్డులు పెరిగే అవకాశముంది. అయితే కొత్తగా వార్డుల ఏర్పాటుకు ప్రతిపాదనలు స్వీకరిస్తుంది.



ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

మున్సిపాలిటీని ఆనుకుని వేగంగా అభివృద్ధి చెందే ప్రాంతాలను బల్దియాలో కలిపేందుకు వీలుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్ నేతృత్వంలో వాటిని గుర్తించేందుకు కసరత్తు చేస్తున్నాం. ఏయే గ్రామాలను విలీనం చేయాలనే వివరాలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

– ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

గ్రామాల విలీనానికి అవకాశం

ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడం తోపాటు అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని సర్కారు ఆదేశించింది. ఆ దిశగా మున్సిపల్, పంచాయతీ, డీటీసీపీఓ శాఖలు కలెక్టర్ ఆధ్వర్యంలో కసరత్తు చేస్తున్నాయి. సుమారు మూడు గ్రామాలు బల్దియాలో కొత్తగా విలీనమయ్యే అవకాశం ఉంది.

– ఫణిందర్‌రావు, డీఎల్‌పీవో, ఆదిలాబాద్

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

- కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్‌రూరల్: భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీర వనిత ఐలమ్మ 129వ జయంతిని జిల్లా బీసీ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రిమ్స్ ఎదుట గల ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బలహీన వర్గాలు, రైతుల హక్కుల కోసం ఐలమ్మ ఉద్యమించారన్నారు. ఆమె జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, నాయకులు సంతోష్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

విధులు అప్రమత్తంగా నిర్వహించాలి

- ఎస్పీ గౌస్ ఆలం



నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు అప్రమత్తంగా వ్యవహరిస్తూ పోలీసులు త్వరితగతిన స్పందించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జిల్లాకేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో గల సమావేశ మందిరంలో గురువారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామాలను సందర్శించి ప్రజలతో సత్సంబంధాలు మెరుగుపర్చుకోవాలని సూచించారు. పల్లెల్లో వైద్యశిబిరాలు, యువతకు స్పోర్ట్స్ కిట్లు అందజేస్తూ టోర్నమెంట్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతీ ఎస్సై పోలీసు ఉన్నతాధికారి వాహనంలో హెల్మెట్, లాఠీ, డాల్, బాడీ ప్రొటెక్టర్ తదితర వాటిని వెంట ఉంచుకోవాలన్నారు. ప్రతీ స్టేషన్‌లో సోమవారం కవాతు, లాఠీ ఉపయోగం, అత్యవసర సమయంలో స్పందించే విషయాలపై శిక్షణ అందించాలని తెలిపారు. గంజాయి కేసులు, రౌడీ షీట్, సస్పెక్ట్ షీట్లు, బైండోవర్లు, అట్రాసిటీ, పోక్సో కేసులు, దొంగతనాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు తదితర వాటిపై సమీక్షించారు. పోలీసు స్టేషన్‌లో రికార్డులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, నాగేందర్, బి.సురేందర్‌రెడ్డి, సీఐ, ఎస్సైలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

టీబీ ల్యాబ్ పరిశీలించిన ఢిల్లీ బృందం



పరిశీలిస్తున్న బృందం సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా క్షయ నివారణ కేంద్రాన్ని, రిమ్స్‌లోని టీబీ ల్యాబ్‌లను నేషనల్ రెఫరెన్స్ ల్యాబరేటరీ ఢిల్లీ బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. రిమ్స్‌లోని డీఎంసీ, సీబీనాట్, కల్చర్ అండ్ డీఎస్టీ ల్యాబ్‌లను సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలు, పరీక్షల తీరు, వాటి నాణ్యత గురించి ఆరా తీశారు. నిబంధనల ప్రకారం వైద్య పరీక్షలు చేస్తున్నారా.. లేదా తదితర వివరాలతోపాటు శాంపిళ్లను తనిఖీ చేశారు. వీరిలో డాక్టర్ అజ్గర్, డాక్టర్ రాజేశ్వర్, దినేష్, రాధిక, సుధాకర్, నల్ల పెరుమల్లు ఉన్నారు. వీరి వెంట జిల్లా టీబీ నివారణ అధికారి సుమలత, మెడికల్ ఆఫీసర్ సాయిప్రియ, ల్యాబ్ టెక్నీషియన్లు నాబిద్, మోసిన్, ప్రమోద్, నాగ భూషణం తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద
- కలెక్టరేట్‌లో అధికారులతో జిల్లాస్థాయి సమీక్ష



మాట్లాడుతున్న శారద

కైలాస్‌నగర్: చట్టాలపై అవగాహన ఉన్నట్లయితే శిక్ష పడుతుందన్న భయంతో ఎలాంటి తప్పు చేయరని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో వివిధ శాఖల అధికారులతో గురువారం జిల్లాస్థాయి సమీక్షా సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. వాటిని ప్రజలకు తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలు అందరికి చేరువయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, అడిషనల్ ఎస్పీ సురేందర్ రావు, మహిళా కమిషన్ మెంబర్ ఈశ్వరీబాయి, జిల్లా సంక్షేమాధికారి సబిత పాల్గొన్నారు.

జైళ్లలో సైకియాట్రిస్టులతో కౌన్సెలింగ్ తరగతులు

సాక్షి, ఆదిలాబాద్/ఆదిలాబాద్‌టౌన్: ఖైదీల మానసిక పరిస్థితి మెరుగుపడేలా సైకియాట్రిస్టులతో కౌన్సెలింగ్ తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జైలును ఆమె సందర్శించారు. ముందుగా ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా ఖైదీల సమస్యలు, ఆరోగ్య పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు మెడికల్ క్యాంప్ నిర్వహించగా, ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని జైళ్లలో మానసిక వైద్యులను నియమిస్తామన్నారు. కలెక్టర్ రాజర్షిషా, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, జిల్లా జైలు సూపరింటెండెంట్ అశోక్ కుమార్, డీఎంహెచ్‌వో కృష్ణ, జిల్లా సంక్షేమాధికారి సబితా, ఐసీడీఎస్ అధికారి మిల్కా, జైలర్లు సూర్య ప్రకాశ్, డిప్యూటీ జైలర్లు ప్రకాశ్, కృష్ణ పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

జైనథ్: మండలంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో నేరెళ్ల శారద పూజలు చేశారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు ఆత్రం సుగుణ, కుమ్ర ఈశ్వరిబాయి, కంది మౌన శ్రీనివాస రెడ్డి, బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆడె గజేందర్, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, రుకేశ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి ఉన్నారు.

ఖానాపూర్ చెరువు ఆక్రమణల గుర్తింపు సర్వే షురూ



చెరువు సరిహద్దు వద్ద నంబర్లు వేస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: పట్టణంలోని ప్రధాన ఖానాపూర్ చెరువులోని ఆక్రమణల గుర్తింపునకు ఎట్టకేలకు గురువారం సర్వే ప్రారంభమైంది. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి సర్వే చేపట్టారు. చెరువు విస్తీర్ణం ఎంతవరకు విస్తరించి ఉంది.. ప్రస్తుతం అందులో ఎంత మేర ఆక్రమణకు గురైందనే దాన్ని అధి కారులు పాత మ్యాప్‌ల ఆధారంగా పరిశీలిస్తూ సరిహద్దు గుర్తించారు. ఆ వివరాలను తెలిపేలా చెరువులో నిర్మించుకున్న ఇళ్లకు ప్రత్యేక నంబర్లు వేశారు. సుమారు అర కిలోమీటర్ దూరంలో చెరువు ఆక్రమణకు గురైనట్లుగా తేల్చారు. ఖానాపూర్ చెరువు 114 ఎకరాల్లో విస్తరించి ఉండగా అందులో 14 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లుగా ప్రాథమికంగా అంచనా వేశారు. వాటిలో సుమారు 240 ఇళ్లు అక్రమంగా నిర్మించుకున్నట్లుగా గుర్తించారు. శుక్రవారం సర్వేను కొనసాగించి మరిన్ని ఆక్రమణలను గుర్తించనున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తెలిపారు. ఈ సర్వేలో ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ సంపతి శ్రీనివాస్, ఇరిగేషన్‌శాఖ డీఈ రాథోడ్ విశాల్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది అజీజ్ ఖాన్, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

రిమ్స్‌లో రక్తపరీక్షలకు బ్రేక్!

- పనిచేయని పరికరాలు
- శాంపిల్స్ టీహబ్‌కు పంపుతున్న వైద్యులు
- ఆలస్యమవుతున్న ఫలితాలు
- ఇబ్బంది పడుతున్న రోగులు



రిమ్స్‌లో పనిచేయని సీబీపీ యంత్రాలు



టీ–హబ్‌లో మొరాయించిన ఎల్‌ఎఫ్‌టీ యంత్రం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో పలు యంత్రాలు తరచూ మొరాయిస్తున్నాయి. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతనెల రోజులకు పైగా రిమ్స్‌లోని కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ) యంత్రాలు మూలనపడ్డాయి. దీంతో రక్తపరీక్షలకు సంబంధించిన రిపోర్టులు ఆలస్యమవుతున్నాయి. మూడు యంత్రాలు మరమ్మతులకు గురికావడంతో రిమ్స్ ఆవరణలోని టీ–హబ్‌లో పరీక్షలు చేస్తున్నారు. గంటలోపు అందించాల్సిన రిపోర్టు కోసం మరుసటి రోజు వరకు వేచిచూడాల్సిన దుస్థితి నెలకొంది. టీ–హబ్‌లో కూడా పలు యంత్రాలు మూలనపడ్డాయి. 57 రకాల పరీక్షలు చేపట్టాల్సి ఉండగా, కేవలం 7 రకాల పరీక్షలు మాత్రమే చేస్తున్నారని రోగుల బంధువులు చెబుతున్నారు. అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

నెలరోజులుగా ఇబ్బందులు

రిమ్స్‌లోని ప్యాథాలజీ విభాగం హెమటాలజీలో 3 సీబీపీ యంత్రాలు ఉన్నాయి. ఈ విభాగంలో మూడు షిఫ్టుల్లో ముగ్గురు చొప్పున ల్యాబ్ టెక్నీషియన్లు పనిచేస్తున్నారు. ఈ యంత్రాలు పనిచేయకపోవడంతో వీరికి పనిలేకుండా పోయింది. ఆయా వార్డుల నుంచి సేకరించిన రక్తనమూనాలు కుప్పలుతెప్పలుగా పడుతున్నాయి. వీటిని టీ–హబ్‌కు పంపుతున్నారు. టీ–హబ్‌లో ఆయా మండలాల్లోని పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల నుంచి నమూనాలు పంపుతున్నారు. రిమ్స్ నుంచే ప్రతీరోజు 300 నుంచి 400 వరకు నమూనాలు వస్తున్నాయని సిబ్బంది చెబుతున్నారు. దీంతో తమకు పనిభారం పెరగడంతోపాటు యంత్రాలపై లోడ్ పడుతుందని, దీంతో ఇవి సైతం మరమ్మతులకు గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. సీబీపీ యంత్రం ద్వారా డబ్ల్యూబీసీ, ఆర్‌బీసీ, హెచ్‌బీ, ప్లేట్‌లెట్ పరీక్షలు చేస్తారు. ప్రస్తుతం రోగులతో రిమ్స్ కిక్కిరిసిపోగా, సరైన సమయంలో రిపోర్టులు అందకపోవడంతో వారు అవస్థలు పడుతున్నారు.

టీ–హబ్‌లోనూ..

టీ–హబ్‌లో 57 రకాల పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఇక్కడ సైతం ఎల్‌ఎఫ్‌టీ పరీక్షలు చేసేందుకు రీయేజెంట్లు లేక నిలిపివేశారు. గత కొన్నిరోజులుగా వివిధ రకాల పరీక్షలు చేయడం లేదు. ప్రస్తుతం టీ–హబ్‌లో సీబీపీ, ఎల్‌ఎఫ్‌టీ, థైరాయిడ్, బి–12, బి–3, క్యాల్షియం, యూరిక్ యాసిడ్ పరీక్షలు మాత్రమే చేస్తున్నారు. షుగర్ పరీక్షకు సంబంధించిన హెచ్‌బీఏ1సీ తదితర పరీక్షలు చేయడం లేదు. దీంతో గత్యంతరం లేక రోగులు ప్రైవేట్ ల్యాబ్‌ల్లో వేల రూపాయలు చెల్లించి పరీక్షలు చేసుకుంటున్నామని వాపోతున్నారు. టీ–హబ్‌లో తరచూ ఏదో ఒక యంత్రం పని చేయకపోవడం, అవి మరమ్మతుల్లో ఉన్నాయని సిబ్బంది చెప్పడంతో వేరే దారి లేక వెనుదిరగాల్సి వస్తోందని రోగులు, వారి బంధువులు పేర్కొంటున్నారు.


ఇబ్బంది లేకుండా చర్యలు

రిమ్స్ ఆవరణలోని టీ–హబ్‌లో రోగులకు సీబీపీ పరీక్షలు చేయిస్తున్నాం. సకాలంలో రిపోర్టులు వస్తున్నాయి. మరమ్మతులకు గురైన యంత్రాలను బాగు చేసేలా చూస్తున్నాం. రోగులకు ఇబ్బంది లేకుండా టీ–హబ్‌లో పరీక్షలు చేసేలా చర్యలు చేపట్టాం. టీ–హబ్‌లో మొరాయించిన యంత్రాన్ని సైతం రిపేర్ చేయిస్తాం.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

- కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించే స్త్రీ నిధి రుణాల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లాకేంద్రంలోని టీటీడీసీలో డీఆర్‌డీఏ పరిధిలోని ఏపీఎంలు, సీసీలు, జిల్లా అధికారులతో స్త్రీ నిధి అమలుపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా స్త్రీ నిధి రుణ లక్ష్యాలు, రుణాల మంజూరు, రికవరీ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా చూడాలన్నారు. ప్రతీ మండలంలో రుణాల రికవరీ వందశాతం జరగాలన్నారు. ఎవరైన సిబ్బంది అవినీతికి పాల్పడినట్లు తేలితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ సభ్యురాలికి రుణాలందించేలా ఏపీఎంలు, సీసీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీవో సాయన్న, మెప్మా పీడీ మమత, పశు సంవర్ధకశాఖ అధికారి కిషన్, విజయ డైరీ డీడీ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాయపడిన వృద్ధుడు మృతి


అలిశెట్టి విఠల్ (ఫైల్)

ముథోల్:బాసర మండలం కిర్గుల్ గ్రామానికి చెందిన అలిశెట్టి విఠల్ (61) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడని ఎస్సై సాయికిరణ్ తెలిపారు. విఠల్ బుధవారం తానూరు మండలం నంద్గాం గ్రామానికి బంధువుల అంత్యక్రియల కోసం వెళ్లాడు. ద్విచక్రవాహనంపై తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ముథోల్ మండలం జలశంకర్ మూలమలుపు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో విఠల్‌కు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భైంసా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. విఠల్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

డివైడర్‌కు ఢీకొని రిటైర్డ్ కార్మికుడి మృతి


లక్ష్మారెడ్డి (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని కలెక్టరేట్ చౌరస్తా సమీపంలో జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొని సింగరేణి రిటైర్డ్ కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీలో నివాసం ఉండే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు పారెడ్డి లక్ష్మారెడ్డి(67) లారీ ట్రాన్స్‌పోర్ట్ సంఘంలో సభ్యుడిగా ఉన్నాడు. సంఘం పని నిమిత్తం మధ్యాహ్నం పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లి తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో కలెక్టరేట్ చౌరస్తా సమీపంలో జాతీయ రహదారి డివైడర్‌ను ఢీకొట్టాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు రైల్వే కాంట్రాక్ట్ కార్మికుడు మృతి


మృతుడు సత్య నారాయణ(ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గోదావరి రైల్వే బ్రిడ్జి వద్ద కాంట్రాక్ట్ కార్మికుడు ఆకారపు సత్యనారాయణ పటేల్ పాము కాటుకు గురై మృతిచెందాడు. జీఆర్పీ ఎస్సై మహేందర్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనారాయణ కొంత కాలంగా రైల్వేబ్రిడ్జి వద్ద కొల్‌కతాకు చెందిన కాంట్రాక్టర్ షెడ్డుకు తాత్కాలిక వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి విధి నిర్వహణలో ఉండగా పాము కాటేసింది. విధుల్లో ఉన్న మరో ఉద్యోగి అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం సత్యనారాయణ పటేల్(55) చనిపోయాడు. ఆయనకు భార్య భారతి, కూతురు సుస్మిత ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళనకు యత్నించారు. కాంట్రాక్టర్ స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చూరీలో భద్రపర్చారు. కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ ఎస్సై తెలిపారు.

ఈసారైనా కష్టాలు తప్పేనా?

- అక్టోబర్ 3 నుంచి నవరాత్రి ఉత్సవాలు
- సమస్యలపై పూర్తిస్థాయి దృష్టి పెట్టాలి


నిర్మాణాలు పూర్తికాక నిలిచిన నీరు


బాసరలోని క్యూలైన్‌లు

భైంసా/బాసర: బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ ఉత్సవాల్లో దసరా నవరాత్రులు ప్రధానమైనవి. తొమ్మిది రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు దేశ నలుమూలల నుంచి భక్తులు పోటెత్తుతారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మూలనక్షత్రం రోజు లక్షల్లోనే భక్తులు ఇక్కడికి తరలివస్తారు. కానీ ఏటా ఉత్సవాల్లో చేపట్టే పనులన్నీ మొక్కుబడిగా ఉండడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రధానంగా తాగునీరు కూడా దొరకడంలేదు. ఆలయానికి కోట్ల రూపాయల ఆదాయం ఉన్నా భక్తులకు వసతులు కల్పించడంలో మాత్రం అధికారులు దృష్టి సారించడంలేదు.

మరో వారం రోజుల్లోనే...

వచ్చేనెల 3 నుంచి దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటి వరకు ఆలయ అధికారులు ఉత్సవాల నిర్వహణపై ఎలాంటి సమావేశాలు నిర్వహించలేదు. ప్రసాదం తయారీ కేంద్రం నుంచి ప్రత్యేక క్యూలైన్‌లు మాత్రం నిర్మిస్తున్నారు.

ఏళ్లు గడుస్తున్నా...

బాసర ఆలయ గర్భగుడికి ఎదురుగా ఏళ్ల క్రితమే స్వాగతతోరణం నిర్మించారు. తోరణానికి ముందు ఆలయానికి వెళ్లే మార్గంలో క్యూలైన్‌లు నిర్మించేందుకు పది అడుగులమేర గోతులు తవ్వి పనులు చేపట్టకుండానే వదిలేశారు. వర్షం కురిసినప్పుడల్లా అందులో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. పైగా ఈ ప్రదేశం క్యూలైన్‌ను ఆనుకుని ఉంది. ఇక్కడ నిలిచే నీటి నుంచి వచ్చే దోమలు భక్తులను ఇబ్బందులు పెట్టే ప్రమాదం ఉంది. ఈ ప్రదేశాన్ని అప్పటివరకు మూసివేయడమో... నిర్మాణాలు పూర్తి చేయడమో చేయాల్సి ఉంది.

దీక్షాపరుల కోసం...

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బాసరలో అమ్మవారి దీక్షాపరుల సంఖ్య పెరుగుతుంది. ఏటా దీక్షాపరులంతా తొమ్మిది రోజులపాటు ఆలయంలోనే ఉండి సేవలు అందిస్తారు. సాయంత్రం, సంధ్యాకాలంలో స్నానాలు చేసి తెల్లని వస్త్రాలు ధరించి దీక్షలు పూర్తి చేస్తారు. ఎంతో మంది పాదయాత్రగా బాసరకు వస్తారు. దీక్షాపరులు, పాదయాత్రగా వచ్చే భక్తుల కోసం బాసర ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.

- నవరాత్రి ఉత్సవాల్లో బాసర ఆలయంలో అక్షరశ్రీకార పూజలు జరిపే మండపాల సంఖ్య పెంచాలి.

ఇలా చేస్తే మేలు..

- భక్తుల రద్దీకి అనుగుణంగా వైదిక సిబ్బందిని పెంచి త్వరితగతిన అక్షరాభ్యాసాలు జరిగేలా చూడాలి.
- క్యూలైన్‌లో ఆలయం తరఫున భక్తులకు తాగునీరు, పాలు, బిస్కెట్లు అందేలా చర్యలు తీసుకోవాలి.
- ప్రధాన కూడళ్లలో విద్యుత్‌లైట్లు బిగించాలి.
- వాహనాలకు పార్కింగ్ ఏర్పాట్లు చేయాలి.
- భక్తులు వెళ్లే క్యూలైన్‌లలో అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునేలా మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలి.
- ఆలయ ప్రాంగణం, ప్రధాన ద్వారం, క్యూలైన్‌లు గోదావరి ఘాట్ వద్ద తాగునీరందించాలి. గంటల తరబడి క్యూలో నిరీక్షించే భక్తులకు ఉప్మా, పులిహోర, అరటిపండ్లు అందించాలి.
- ఆలయానికి దూరంగా పార్కింగ్ సౌకర్యం కల్పిస్తుండడంతో అక్కడి నుంచి వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలు నడిచి వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. పార్కింగ్ స్థలం నుంచి ఆలయం వరకు బస్సులు ఏర్పాటు చేయాలి. ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు నిజామాబాద్, భైంసా నుంచి ప్రత్యేక బస్సులు నడపాలి.
- రైల్వేస్టేషన్, గోదావరి ఘాట్, అమ్మవారి ఆలయం వద్ద ఉచిత బస్సు తొమ్మిది రోజుల పాటు నిరంతరాయంగా నడిచేలా చర్యలు తీసుకోవాలి.
- అన్నదానసత్రంతో పాటు మరికొన్ని చోట్ల అన్నదానం ఏర్పాట్లు చేయాలి. ప్రసాదాలు, టికెట్ల కౌంటర్లను పెంచాలి. ఈ సమస్యలపై దృష్టి పెట్టాలని భక్తులు కోరుతున్నారు.

వాగులో కొట్టుకుపోయిన ఎడ్ల బండి

- రెండు ఎడ్లు, లేగదూడ మృతి


ఎద్దును పరిశీలిస్తున్న పశువైద్యాధికారి శ్రీకర్

సారంగపూర్: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం తాండ్ర(జి) గ్రామ సమీపంలోని తుమ్మల వాగులో బుధవారం సాయంత్రం ఎడ్లబండి కొట్టుకుపోయింది. గ్రామానికి చెందిన రైతు జాదవ్ అరవింద్ బుధవారం ఉదయం వ్యవసాయ పనులకు వాగు అవతల ఉన్న చేను వద్దకు ఎడ్ల బండిలో వెళ్లాడు. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వస్తున్న క్రమంలో భారీ వర్షం కురిసింది. దీంతో తుమ్మల వాగులో ప్రవాహం పెరిగింది. ప్రవాహాన్ని అంచనా వేయకుండా రైతు అరవింద్ వాగులో నుంచి ఎడ్ల బండిని పోనిచ్చారు. అయితే వరద ఉధృతికి ఎద్దులు, లేగదూడతో సహా కొట్టుకుపోయింది. ప్రమాదం గమనించిన రైతు చెట్టు కొమ్మను పట్టుకుని బయటపడ్డాడు. వరద ఉధృతికి ఎద్దులు, లేగదూడ నీట మునిగి ఊపిరాడక మృతిచెందాయి. గురువారం ఉదయం వాటి కళేబరాలు లభ్యమయ్యాయి. బాధిత రైతులు మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ప్రభుత్వం తరఫున సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ఎలుగుబంటి దాడిలో ఒకరికి గాయాలు


క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎఫ్ఆర్వో

ఖానాపూర్: మండలంలోని అడవి సారంగాపూర్ పంచాయతీ పరిధిలో జిల్లేడుకుంట అటవీప్రాంతంలో ఓ వ్యక్తిపై ఎలుగుబంటి దాడిచేసింది. గ్రామానికి చెందిన రైతు తొడసం సోనేరావు తన ఆవు తప్పిపోవడంతో దానిని వెతికేందుకు గ్రామానికి చెందిన భీంరావు, అమృత్‌రావుతో కలిసి అటవీ ప్రాంతానికి వెళ్లాడు. ఈ క్రమంలో పిల్లతో ఉన్న ఎలుగుబంటి సోనేరావుపై దాడి చేయడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న రైతులు కేకలు వేయడంతో ఎలుగుబంటి వెళ్లిపోయింది. వెంటనే బాధితుడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం నిర్మల్‌కు రెఫర్ చేశారు. ఎఫ్ఆర్వో కిరణ్ ఆస్పత్రికి చేరుకుని కుటుంబీకులను పరామర్శించారు. అటవీశాఖ తరఫున మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్షతగాత్రుడికి ప్రాణాపాయం తప్పిందని, కుటుంబీకులు ఆందోళన చెందొద్దని పేర్కొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం


ఆహ్వానపత్రిక అందిస్తున్న ఆలయ ఈవో

భైంసాటౌన్:బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానంలో నిర్వహించే శారదీయ శరన్నవరాత్రోత్సవాలకు రావాలని వ్యవస్థాపక వంశీయులు శరత్‌పాఠక్, ఈవో విజయరామారావు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బి.నారాయణ్‌రావు పటేల్‌ను కోరారు. ఈ మేరకు పట్టణంలోని ఆయన నివాసంలో గురువారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అక్టోబర్ 3 నుంచి 12 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కండక్టర్‌పై దాడి

భీమారం: కండక్టర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు భీమారం ఎస్సై బి.రాములు తెలిపారు. సిరొంచకు వెళ్లిన ఆర్టీసీ బస్సు బుధవారం రాత్రి మంచిర్యాల డిపోకు వెళ్తుండగా వేమనపల్లికి చెందిన సిడం మహేష్ చెన్నూర్‌లో ఎక్కాడని తెలిపారు. మద్యంమత్తులో తోటి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేయడాన్ని గమనించిన కండక్టర్ జి.భాస్కర్ అతడిని వారించే ప్రయత్నం చేయగా భీమారం సమీపంలో రాగానే దాడి చేశాడని తెలిపారు. కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రేమపేరిట మోసం.. గర్భం దాల్చిన యువతి

తలమడుగు: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని యువకుడు యువతిని మోసం చేసి గర్భవతి చేయగా ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 24 ఏళ్ల యువతిని ఓ గ్రామానికి చెందిన 27 ఏళ్ల యువకుడు గత రెండేళ్లుగా ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని మాట ఇచ్చి గర్భవతిని చేశాడు. ఆమె గర్భందాల్చి రిమ్స్‌లో మగబిడ్డకు జన్మనిచ్చింది. తీరా పెళ్లి విషయమై అడుగగా నిరాకరించడంతో యువతి గురువారం తలమడుగు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు.

వివాహితపై లైంగికదాడి

కుభీర్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితపై గురువారం మధ్యాహ్నం జాదవ్ సాహెబ్‌రావ్ లైంగికదాడి చేసినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. వివాహిత ఇంట్లో ఒంటరిగా ఉండడాన్ని గమనించిన సాహెబ్‌రావు లోపలికి చొరబడి లైంగికదాడి చేశాడు. బాధితురాలు స్పృహ కోల్పోగానే పారిపోయాడు. కాసేపటి తర్వాత బాధితురాలి మరదలు వచ్చి చూడగా ఇల్లంతా చిందరవందరగా ఉంది. బాధితురాలిని లేపగా జరిగిన విషయం చెప్పింది. తర్వాత భర్తకు ఫోన్‌చేసి జరిగిన విషయం తెలిపింది. దీంతో భర్త ఇంటికి వచ్చి పోలీస్‌స్టేషన్‌కు జాదవ్ సాహెబ్‌రావుపై ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని బాధితురాలిని భైంసా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

పగిలిన భగీరథ పైప్


భారీగా బయటకు వస్తున్న నీరు


బైక్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలో గురువారం మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ పగిలింది. దీంతో భారీగా నీరు వృథాగా పోయింది. దేవాపూర్ నుంచి సుంకిడి గ్రామ సమీపంలో సంప్‌లోకి ఈ పైప్‌లైన్ ద్వారా నీరు సరఫరా అవుతోంది. పొన్నారిలో పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి నీరు చేరడంతో గుంత ఏర్పడింది. ఈ పక్కనే రెండు బైక్‌లు నిలిపి ఉంచగా, భారీగా నీరు చేరి మునిగింది. ఒక బైక్‌ను బయటకు తీయగా, మరో బైక్ గంటకు పైగా నీటిలో ఉండిపోయింది. నీటిప్రవాహం తగ్గాక ఆశన్నకు చెందిన బైక్‌ను స్థానికులు తాళ్ల సాయంతో బయటకు తీశారు. కాగా, పక్కన హోటల్‌లోకి భగీరథ నీరు వెళ్లడంతో సామగ్రితోపాటు రిఫ్రిజిరేటర్ పూర్తిగా చెడిపోయింది. ఉంది. దీని విలువ రూ.50 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

'కడెం' గేటు ఎత్తివేత

కడెం: కడెం ప్రాజెక్టుకు గురువారం రాత్రి 5,080 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ప్రాజెక్ట్ అధికారులు ఒక వరద గేటు ఎత్తి 4,179 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 700 అడుగులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

పాముకాటుకు ఎద్దు మృతి

నార్నూర్(గాదిగూడ): గాదిగూడ మండలం కొలామ గ్రామంలో పాముకాటుకు ఎద్దు మృతి చెందింది. గురువారం ఉదయం రైతు మందాడి చిత్రు తన ఎద్దులను పొలం వద్ద ఓ చెట్టుకు కట్టేశాడు. మధ్యాహ్నం వచ్చి చూడగా ఒక ఎద్దు చనిపోయి

విద్యార్థులు హాజరయ్యేలా చూడాలి

లోకేశ్వరం: విద్యార్థులు కళాశాల తరగతులకు హాజరయ్యేలా చూడాలని డీఐఈవో పరశురాం నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుతో మాట్లాడారు. హాజరు శాతం పెంచాలన్నారు. పాఠ్య ప్రణాళి ప్రకారం విద్యాబోధన చేయాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ గౌతం, అధ్యాపకులు వినోద్, విఠల్, చిన్నయ్య, మహేందర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, హరీశ్ ఉన్నారు.

జైనూర్ ఘటనకు రాజకీయరంగు పూయవద్దు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: జైనూర్ ఘటనకు రాజకీయ రంగు పూయవద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో శాంతి వాతావరణం నెలకొల్పేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఇరువర్గాలతో చర్చించారన్నారు. హైదరాబాద్‌లో ఘటన వివరాలను సీఎం, గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. సానుకూలంగా స్పందించిన సీఎం..హైదరాబాద్‌లో వారం రోజుల్లో ఆదివాసీలతో సమావేశమవుతామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంత ఆదివాసీల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు.

జైనూర్ ఘటనలో 22 మందికి బెయిల్

ఆసిఫాబాద్: జైనూర్ మండలంలో జరిగిన ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిన విషయం తెలిసిందే. గురువారం 22 మందికి ఆసిఫాబాద్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 4న జరిగిన హింసాత్మక సంఘటనల్లో జైనూర్ మండల కేంద్రంలోని పలు దుకాణాలు దగ్ధమయ్యాయి. ఈ క్రమంలో సుమారు 60 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులుగా 26 మందిని కరీంనగర్ జైలుకు తరలించారు. నిందితుల్లో 22 మందికి కోర్టు బెయిల్ మంజూరు చేయగా.. వారు జైలు నుంచి విడుదలయ్యారని న్యాయవాది సతీశ్‌బాబు తెలిపారు.

లాభాలపై తప్పుడు ప్రచారం

- ఆధారాలతో సహా చర్చకు సిద్ధం
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వీ.సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: కంపెనీ సాధించిన లాభాలు, కార్మికులకు చెల్లించే వాటాపై కొందరు కార్మిక సంఘాల నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య అన్నారు. గురువారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. లాభాలు ఎలా లెక్కించారు, అందులో వాటా ఏ మొత్తం నుంచి ఇచ్చారో వివరించారు. 2009-10 నుంచి సంస్థకు వచ్చిన లాభాలు, పెట్టుబడుల వివరాలు, వాటా శాతం వివరాలను వివరించారు. ప్రతీసారి మొత్తం లాభాల నుంచి కొంత సంస్థ విస్తరణ, పెట్టుబడులకు కేటాయించిన తర్వాత లాభాలను చూపి అందులో నుంచి వాటా చెల్లిస్తుంటారని తెలిపారు. దీనిపై తాము ఏ చర్చకైనా సిద్ధమే అన్నారు. ఈ సమావేశంలో యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరి కే.వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, నాయకులు గండి సతీష్, మారేపల్లి బాపు, నవీన్‌రెడ్డి, అఫ్రోజ్‌ఖాన్, సురేష్, సదానందం, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వం బకాయిలు చెల్లించాలి'


గనిపై మాట్లాడుతున్న మంద నర్సింహారావు

శ్రీరాంపూర్: సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న రూ.30 వేల కోట్లు వెంటనే చెల్లించాలని సీఐటీయూ కేంద్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఆర్కే 7 గనిపై గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికులతో మాట్లాడారు. అనంతరం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. పెట్టుబడుల పేరుతో లాభాల్లో కోత విధించడం కంటే బకాయిలను వసూలు చేస్తే పెట్టుబడులకు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఏఐటీయూసీని గెలిపిస్తే అన్యాయమే చేస్తున్నారని, లాభాల వాటాపై వారి వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమాల్లో యూనియన్ జిల్లా కార్యదర్శి సంకె రవి, శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి అంబాల శ్రీనివాస్, అధ్యక్షుడు గుల్ల బాలాజీ, ఆర్జీ 2 ఏరియా కార్యదర్శి ప్రవీణ్, నాయకులు నరహరి, వెంగళ శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, నవీన్, అనిల్, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

చదువుకున్న బడిలోనే..ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు


బాధ్యతలు స్వీకరిస్తున్న సంగీత

బోథ్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో చదువుకున్న కౌఠ(బి) గ్రామానికి చెందిన జి.సంగీత.. ఆ బడిలో గురువారం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించింది. ఇదివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన స్వర్ణలత బదిలీపై మెదక్ జిల్లాకు వెళ్లారు. కాగజ్‌నగర్‌లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించిన సంగీత బదిలీపై గత జూలైలో టీజీటీ గణిత ఉపాధ్యాయురాలిగా ఇక్కడకు వచ్చారు. కాగా, ఆమెకు పూర్తిస్థాయి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగిస్తూ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి ఉత్తర్వులు జారీ చేశారు. తాను ఐదు నుంచి పదో తరగతి చదివిన బడిలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించడం అదృష్టంగా భావిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. లెక్చరర్ రవికుమార్, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ లత, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, సూపరింటెండెంట్ అర్చన, సీనియర్ అసిస్టెంట్ చరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఎనిమిది మంది అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవికుమార్

నెన్నెల: నెన్నెల శివారులోని చెరువు సమీపంలో గంజాయి సేవిస్తున్న ఎనిమిది మంది యువకులను గురువారం అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, నెన్నెల ఎస్సై ప్రసాద్‌తో కలిసి బెల్లంపల్లి ఏసీపీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. కొందరు యువకులు చెరువు వద్ద గంజాయి సేవిస్తున్నారని అందిన సమాచారం మేరకు నెన్నెల ఎస్సై వెళ్లగా పారిపోయేందుకు ప్రయత్నించారని చెప్పారు. తాళ్ల గురిజాలకు చెందిన మహ్మద్ ముస్తాఫా గంజాయిని విక్రయించేందుకు రాగా అతడి వద్ద రూ.3,750 విలువైన 169 గ్రాముల గంజాయి లభించిందని తెలిపారు. వారి నుంచి గంజాయి ప్యాకెట్‌తోపాటు నాలుగు బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ముస్తాఫాతోపాటు నెన్నెల మండలం గన్‌పూర్‌కు చెందిన పోతరాజుల ఆకాష్, కన్నెపల్లి మండలం చర్లపల్లికి చెందిన శనిగారపు వినోద్, బెల్లంపల్లి మండలం దుగినేపల్లికి చెందిన జాడి సుందర్, చల్లూరి రమాకాంత్, నెన్నెలకు చెందిన దుర్గం స్వామి, పిట్ట శేఖర్, గుండ్లసోమారానికి చెందిన రత్నం దేవేందర్‌లపై కేసు నమోదు చేశామని తెలిపారు. బెల్లంపల్లికి చెందిన జమీల్ పరారీలో ఉన్నాడని వివరించారు.

దాడి కేసులో ఐదుగురు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్డులో మేర సంజీవ్‌పై ఈ నెల 23న జరిగిన దాడి కేసులో పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ గురువారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. గడప రాకేష్, మేర సంజీవ్ రెండు వర్గాలుగా ఏర్పడి ఉనికిని చాటుకునేందుకు దాడులు చేసుకుంటున్నారు. గతంలో రాకేష్ వర్గం సంజీవ్‌పై దాడి చేసింది. దీంతో సంజీవ్ అనుచరులతో కలిసి ఈ ఏడాది జూన్ 2న రాకేష్‌పై దాడి చేసి గాయపర్చారు. రాకేష్ వర్గం సంజీవ్ హత్యకు గద్దెరాగడి సమీపంలోని తిమ్మాపూర్‌కు చెందిన పులగం నగేష్ ఇంట్లో పథకం వేసుకున్నారు. మందమర్రి మండలం ఎర్రగుంటపల్లికి చెందిన పోచంపల్లి సంపత్, విశాల్ అనుచరులు 11మందితో కలిసి ఈ నెల 23న సంజీవ్‌పై దాడి చేశారు. దీంతో సంజీవ్‌తోపాటు తోటమాలి అబ్దుల్ అఫ్రోజ్, వాచ్‌మెన్ దోమల శంకరయ్య గాయపడ్డారు. ప్రతిగా వీరు చేసిన దాడిలో రుద్రతేజ్, జ్ఞానేశ్వర్‌లకు గాయాలయ్యాయి. ఈ కేసులో 19మంది హస్తం ఉన్నట్లు తేలిందని, స్థానిక జాఫర్‌నగర్‌కు చెందిన కుంట శ్రీధర్, ఎస్కే అబ్దుల్ రసూల్, తిలక్‌నగర్‌కు చెందిన ఎండీ.అన్వర్, జుమ్మాడ పున్నం, తిమ్మపూర్‌కు చెందిన పులగం నాగేష్‌లను అరెస్టు చేసినట్లు ఏసీపీ వివరించారు. మరో 14మంది పరారీలో ఉన్నారని తెలిపారు. సమావేశంలో సీఐ బన్సిలాల్, ఎస్సై సనత్‌కుమార్ పాల్గొన్నారు.

వాగులో పడి వ్యక్తి మృతి

భీమిని: మండల కేంద్రానికి చెందిన కల్యాణం మల్లేష్(45) గురువారం మృతిచెందాడు. కటింగ్ కోసం మామిడిపల్లికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో మద్యం సేవించి ఉండడంతో ప్రమాదవశాత్తు వాగులో పడి మృతిచెందినట్లు అనుమానిస్తున్నారు. మృతుడి భార్య కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య కమల, కూతురు స్వాతి, కుమారుడు రాకేష్ ఉన్నారు.